సాక్షి కర్నూలు

శనివారం, 1, జూలై, 2023



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబాదేవికి దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు షోడశోపచార పూజలు చేశారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై శుక్రవారం నందికొట్కూరుకు చెందిన లిక్షితాశ్రీ నృత్యకళాశాల విద్యార్థుల సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.



వైద్యం.. పెరిగిన నమ్మకం

రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. రోగులకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుతున్నాయి.

IIలో

న్యూస్‌రీల్

నేటి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

కర్నూలు(అర్బన్): నేటి నుంచి ఐదు రోజుల పాటు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లాలో 2,36,767 మందికి రూ.65,83,29,750.. నంద్యాల జిల్లాలో 2,14,259 మందికి రూ.59,13,58,500 పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రెండు జిల్లాల్లోని 12 ప్రధాన బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.124,96,88,250 ఇప్పటికే విడుదల చేసింది. అన్ని గ్రామ/ వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికి వెళ్లి పెన్షన్లను అందించనున్నారు.

5 వరకు మచిలీపట్నం రైలు రద్దు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు–మచిలీపట్నం మధ్య రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(07067 / 07068) ను జూలై 5వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, గుంతకల్లు డివిజన్ల మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ రైలును తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

నేటి నుంచి రాగులు, జొన్నలు, గోధుమ పిండి పంపిణీ

కర్నూలు(సెంట్రల్): పౌరసరఫరాల సంస్థ పంపిణీ చేసే నిత్యావసర సరుకుల జాబితాలో రేషన్ కార్డుదారులకు బియ్యం, చెక్కర, బ్యాళ్లతోపాటు రాగులు, జొన్నలు, గోధుమ పిండి చేరాయి. జూలై 1 నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేసే బియ్యానికి బదులు ఉచితంగా రాగులు, జొన్నలను పొందవచ్చు. అలాగే అర్బన్ కార్డుదారులు కేజీ రూ.16తో గోధుమ పిండిని పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్రీడా మైదానాలను గుర్తించండి

కర్నూలు(సెంట్రల్): ఆడుదాం–ఆంధ్రా క్రీడల నిర్వహణకు అనువైన మైదానాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆడుదాం–ఆంధ్రాపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్లో యువతను ప్రోత్సహించే దిశగా 2.99 లక్షల మ్యాచులు, 40 లక్షల మంది క్రీడాకరులతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ క్రీడలను గ్రామ/వార్డు సచివాలయాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఐదు విభాగాలుగా 45రోజుల పాటు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అక్టోబర్‌లో ఆడుదాం–ఆంధ్రా క్రీడలు జరిగే అవకాశం ఉందని, అంతలోపు క్రీడాకారులను సచివాలయాల వారీగా గుర్తించాలన్నారు. సమావేశంలో సెట్కూరు సీఈఓ పి.రమణ, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య బదిలీ

కర్నూలు(అర్బన్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్యను బదిలీ చేస్తు సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్ హోదాలో ఉన్న ఈయన జిల్లాలో డ్వామా పీడీ, జెడ్పీ సీఈఓగా విధులు నిర్వహించి ప్రస్తుతం డీఆర్‌డీఏ, వైకేపీ పీడీగా ఏడు నెలలుగా పనిచేస్తున్నారు. డెప్యూటేషన్ గడువు దాదాపు ఐదేళ్లు పూర్తి కావడంతో మాతృసంస్థ అయిన సహకార శాఖకు వెంకటసుబ్బయ్యను బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో డీఆర్‌డీఏకు కొత్త పీడీ వచ్చే అవకాశం ఉంది.

డీఈఓ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కర్నూలు సిటీ: పదోన్నతుల కోసం సెకండరీ గ్రేడ్ టీచర్ల, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు(తెలుగు, ఉర్దూ, కన్నడ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, లాంగ్వేజ్ పండిట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు ఇంటర్ సీనియారిటీ జాబితా తయారు చేశామని పేర్కొన్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రం 4 గంటల వరకు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు.



సీమ సిగలో కందనవోలు సౌరభం

- కర్నూలు జిల్లాగా అవతరించి నేటికి 165 ఏళ్లు
- 1858 జూలై ఒకటో తేదీన 8 తాలూకాలతో ఆవిర్భావం
- జిల్లా నుంచి కీలక పదవులు అలంకరించిన నేతలు
- చారిత్రక కట్టడాలకు.. పురాతన ఆలయాలకు నిలయం
- విభిన్న సంస్కృతులు..వింత ఆచారాలు
- నేడు ఆవిర్భావ దినోత్సవం

వానలు కురిస్తే వజ్రాలు పండే నేల ఇది.. ఆదిమ మానవుని ఆనవాళ్లను అద్దుకున్న ప్రాంతమిది.. బ్రిటీష్ వారి నిరంకుశ పాలనను ఎదురించిన గడ్డ ఇది.. తమ సాంస్కృతిక వైభవాన్ని ఖండాంతరాలకు చాటిన సీమ ఇది.. చారిత్రక సంపదకు నిలయంగా.. రాజకీయ చైతన్యానికి పేరుగా నిలిచిన కర్నూలు జిల్లా ఏర్పడి నేటికి 165 ఏళ్లు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

కర్నూలు(సెంట్రల్): ఈస్టిండియా కంపెనీ పాలనలోకి వచ్చే వరకు అనేక చిన్న రాజ్య వంశాల చేత కర్నూలు ప్రాంతం పరిపాలింపబడేది. ఈస్టిండియా కంపెనీ పూర్తిగా బ్రిటీషు రూల్‌కు కిందకు వెళ్లిపోయిన తరువాత 1858 జూలై ఒకటో తేదీన పరిపాలన సౌలభ్యం కోసం 8 తాలూకాలతో కర్నూలు జిల్లా అవతరించింది.

అప్పటి జిల్లా స్వరూపమిదీ..

కర్నూలు పరిధిలోని రామళ్లకోట, నంద్యాల, శిరివెళ్ల, నందికొట్కూరు, కడప జిల్లా నుంచి దూపాడు(మార్కాపురం), కంభం, కోవెలకుంట్ల, బళ్లారి జిల్లా నుంచి పత్తికొండ కలిపి మొత్తం 8 తాలూకాలతో కర్నూలు జిల్లా అవతరించింది. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు జిల్లాలో ఎలాంటి మార్పులు సంభవించలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బనగానపల్లె సంస్థానం కొన్ని నెలలు ఇండియన్ యూనియన్‌లో కలువలేదు. కాంగ్రెస్ నాయకుల ఉద్యమాల ఫలితంగా 1948 ఫిబ్రవరి 18వ తేదీన ఆ సంస్థానం భారతదేశంలో భాగమైంది. తరువాత బనగానపల్లెను ఉప తాలూకాగాచేసి కర్నూలు జిల్లాలో విలీనం చేశారు.

కర్నూలులో సబ్‌కలెక్టర్ కార్యాలయం

ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించడంలో థామస్ మన్రో కీలకపాత్ర పోషించాడు. దీంతో 1800లో ఈయనను రాయలసీమ జిల్లాలకు కలెక్టర్‌గా నియమించారు. అనంతరం 1807లో దత్తమండలాలను నాలుగు సబ్‌కలెక్టర్ విభాగాలు ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలో 1807లో మొదటి సారి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటైంది. 1839లో కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ తిరుగుబాటు చేయడంతో ఈస్టిండియా కంపెనీ వారు కర్నూలును తమ రాజ్యంలో కలుపుకున్నారు.



రాజకీయాల్లో ప్రత్యేకం

కర్నూలు జిల్లా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. ఇక్కడి నుంచే రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. నీలం సంజీవరెడ్డి ప్రధానమంత్రి కాక మునుపు 26 రోజులు పార్లమెంట్ స్పీకర్‌గా కూడా పనిచేశారు. అలాగే బనగానపల్లెకు చెందిన పెండేకంటి వెంకటసుబ్బయ్య గవర్నర్‌గా పనిచేశారు. నంద్యాల నుంచి ఎంపీగా గెలిచి పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయ్యారు. కర్నూలు జిల్లా నుంచి నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. నీలం సంజీవరెడ్డి సొంత జిల్లా అనంతపురం అయినా ఆయన డోన్ నుంచి ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహించి ముఖ్యమంత్రి అయ్యారు.

సాంస్కృతిక వికాసం

కర్నూలు జిల్లాలో విభిన్న సంస్కృతులు ఉన్నాయి. ఇక్కడ పండుగలు ప్రత్యేకంగా జరుపుకుంటారు. దసరా పండుగ రోజున దేవరగట్టులో కర్రల సమరం..ఉగాది పండుగ రోజున కైరుప్పలలో నుగ్గులాట..హోలి పండుగ రోజున హొళగుంద ప్రాంతంలో పురుషులు ఆడవేషాలు వేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. పత్తికొండ ప్రాంతంలోని గొరవయ్యలు ఖండాంతరాల్లో నృత్యప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు.

రాజధాని వైభవం

మద్రాసు రాష్ట్రంలోని పదకొండు జిల్లాలు కలసి 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అప్పుడు ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధానిగా కర్నూలును ఎంపిక చేశారు. 1953 అక్టోబరు 1 నుంచి 1956 అక్టోబరు 31 వరకు ఆంధ్రరాష్ట్ర రాజధానిగా కర్నూలు కొనసాగింది. హైదరాబాద్ నుంచి రాయలసీమలో ఏ జిల్లాకు వెళ్లాలన్నా కర్నూలు నుంచి ప్రయాణించాలి. దీంతో కర్నూలును రాయలసీమ ముఖద్వారంగా వ్యవహరిస్తారు.

చారిత్రక సంపద

- కర్నూలు నగరానికి 18 కి.మీ దూరంలో ఉన్న కేతవరంలో రాతి శిలలపై అతి ప్రాచీన చిత్రలేఖనాలు ఉన్నాయి. ఇక్కడ ఆదిమ మానవుడు సంచరించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.
- కర్నూలు నగరం నడిబొడ్డున ఉన్న కొండారెడ్డి బురుజును విజయనగర రాజు అచ్యుతదేవరాయలు కట్టించారు. బ్రిటీష్ వారు స్వాతంత్ర్య సమరయోధుడు కొండారెడ్డిని ఈ కోటలో బంధించడంతో దీనికి ఆపేరు వచ్చినట్లు తెలుస్తోంది.
- తుగ్గలి మండలం జొన్నగిరిలో అశోకుని శిలాశాసనాలు ఉన్నాయి.

2022లో రెండు జిల్లాలుగా విభజన

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 2022లో కర్నూలు జిల్లాను రెండుగా విభజించారు. కర్నూలుకు 26 మండలాలు, నంద్యాలకు 28 మండలాలు కేటాయించారు. 2022 ఏప్రిల్ 4 ముందు కర్నూలు జిల్లా జనాభా(44 లక్షలు) అమెరికా దేశంలోని ఒరిగాన్ రాష్ట్రంతో సమానంగా ఉండేది. దేశంలో 10వ విశాలమైన జిల్లాగా ఉండేది. ప్రస్తుతం నంద్యాల జిల్లా కంటే తక్కువ వైశాల్యం గల జిల్లాగా మారడం విచిత్రం.

నేడు జిల్లా ఆవిర్భావ వేడుకలు

కర్నూలు జిల్లా ఇంటలెక్చువల్ కంసోర్టియం ఆధ్వర్యంలో జిల్లా ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మద్దూరు నగర్‌లోని తెలుగుతోటలో చరిత్రకారులు, మేధావుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరపనున్నారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.

కర్నూలుకు ఎంతో చరిత్ర ఉంది



కర్నూలు అంటే రాయలసీమ ముఖ ద్వారం. ఆనాడు స్వాతంత్రం పోరాటం కంటే ముందు గౌడప్ప గౌడు, గులాం రసూల్‌ఖాన్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆంగ్లేయులపై ఉవ్వెత్తున దండెత్తారు. ఆ రోజు వారు యుద్ధంలో గెలిచి ఉంటే బ్రిటీషోళ్ల చరిత్రే ఉండేది కాదు. కర్నూలు జిల్లాగా 1858 జూలై ఒకటో తేదీన అవతరించింది. ఆనాడు 8 తాలూకాలతో అవతరించిన కర్నూలు జిల్లాలో రెండు విడిపోయే నాటికి 54 మండలాలుగా ఉండేది. పరిపాలనా సౌలభ్యంకోసం విడిపోవడం మంచిదే.– డాక్టర్ మన్సూర్ రెహమాన్, రిటైర్డ్ ప్రొఫెసర్, కర్నూలు

మోసం చంద్రబాబు నైజం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



నగరూరు బీటీ రోడ్డు మరమ్మతులను జేసీబీతో ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆస్పరి: మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం మండలంలోని నగరూరు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సర్పంచ్ సావిత్రమ్మ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.30లక్షలతో బీటీ రోడ్డు మరమ్మతు పనులను జేసీబీతో మంత్రి ప్రారంభించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో మంత్రి సమావేశమై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. టీడీపీ పాలనా కాలంలో హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. మరోసారి హామీల పేరుతో మాయ మాటలు చెబుతున్నారని, వాటిని పట్టించుకోవద్దని సూచించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. నగరూరు గ్రామంలో వివిధ పథకాలు కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుమ్మనూరు నారాయణస్వామి, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో డెంగీ ప్రబలే అవకాశం ఉందని, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఒడి కార్యక్రమాన్ని జూన్ 30 నుంచి జూలై 7వ తేదీవరకు మండలాల్లో చేపట్టాలని సూచించారు. ఒక్క విద్యార్థి బడి బయట ఉండకూడదని, వలంటీర్లతో సర్వే చేయించి పాఠశాలలకు వెళ్లని వారిని గుర్తించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పడక్బందీగా అమలు చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

పత్తికొండలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.3.01 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు
- భూమిపూజ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. కొత్తపల్లి రిజర్వాయర్ వద్ద జలజీవన్ మిషన్ కార్యక్రమం క్రింద రూ.3.01 కోట్లుతో చేపట్టనున్న పనులకు శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పత్తికొండ పట్టణంలో 35 వేలకు పైగా జనాభా ఉందని, నీటి సమస్య పరిష్కారం కోసం కొత్తపల్లి రిజర్వాయర్ వద్ద నుంచి పైపులైను వేస్తున్నట్లు తెలిపారు. మొత్తం మూడు కిలోమీటర్లు వేసే పైపులైన్ దూదేకొండ గ్రామం వద్ద ఉన్న బండగట్టు పైప్ లైన్‌కు అనుసంధానం చేస్తారన్నారు. ఈ పైపులైను ద్వారా పత్తికొండ పట్టణంలోని ట్యాంకులకు నీటిని సరఫరా చేసి, అన్ని కాలనీలకు సరఫరా చేస్తారన్నారు. ప్రతి రోజూ 2 మిలియన్ లీటర్ల నీటిని ఫిల్టర్ చేసే సామర్థ్యంతో బెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనులు పూర్తయితే పత్తికొండ పట్టణంలోని 13 వేల కుటుంబాలకు నీటి కొరత ఉండబోదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్, ఏఈలు విష్ణువర్ధన్‌రెడ్డి మయాంక్‌సింగ్, హనుమంతు, ప్రాజెక్టు ఏఈ ఎంఏ చౌదరి, వైస్ ఎంపీపీ బలరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, శ్రీరంగడు, నార్లశివప్పయ్య, గాంధీరెడ్డి, కారం నాగరాజు, కేశవరెడ్డి, అంజినయ్య, పందికోన మల్లి, నజీర్, చందోలి రవిరెడ్డి, కరువాల హుసేన్ పాల్గొన్నారు.

పులి కాంతకు ఏకాంతం

- వన నిశ్శబ్దంతోనే పులి ప్రవర్ధనం
- వన విహారాలకు మూడు నెలల సెలవు
- ఎకో టూరిజం బుకింగ్ నిలిపివేత



ఆత్మకూరురూరల్: నల్లమల అడవిలో పులుల ఏకాంతానికి ఫారెస్ట్ అధికారులు చేపట్టారు. ఏటా జూలై 1 నుంచి సెప్టెంబర్ 1 వరకు మూడు నెలల పాటు నల్లమల అడవుల్లో జనసంచారం నిషేధం విధించే అటవీశాఖ ఈ ఏడాది కూడా అన్ని పర్యావరణ, ఆధ్యాత్మిక పర్యాటకాలను నిలుపుదల చేసింది. ఈ మేరకు అటవీశాఖ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదన్ రెడ్డి జీవో విడుదల చేశారు. దీంతో బైర్లూటి నల్లమల జంగిల్ క్యాంప్, పచ్చర్ల, తుమ్మల బయలు ఎకో టూరిజం రిసార్ట్స్‌లో ఆన్‌లైన్ బుకింగ్ నిలిపి వేశారు. అంతే కాకుండా దట్టమైన అడవుల్లో ఉన్న ఇష్టకామేశ్వరి, నాగలూటి వీరభద్రాలయం, రుద్రకోడు, గుండ్ల బ్రహ్మేశ్వరానికి వెళ్లే భక్తులకు అటవీ ప్రవేశం నిలిపివేశారు. ఏడాదిలో మూడు నెలల కాలం అడవుల్లో జనసంచారం నిషేధించేందుకు ముఖ్య కారణం పులుల కలయికలో ఆడపులికి ఉండే కొన్ని సహజ లక్షణాలే అంటే ఆశ్చర్యం కలుగక మానదు. సహజంగా పులులు వన్య ప్రాణుల్లో అత్యంత సిగ్గరులు. సాధారణంగా అవి మనుషుల కంట పడడానికే ఇష్ట పడవు. సమాగ సమయాల్లో సిగ్గరితనం మరింత పెరిగి పోతుంది. ముఖ్యంగా ఆడ పులులు సమాగసమయాల్లో మనుషుల ఉనికిని అసలు సహించ లేవు. ఏ చిన్న అలికిడి అయినా రతి క్రియ నుంచి తప్పుకుంటాయి. ఇది పులుల ప్రవర్ధనానికి పెద్ద ఆటంకంగా మారుతుంది. అందుకే ఎపులుల సమాగ సమయమైన జూలై మొదటి వారం నుంచి సెప్టెంబర్ చివరి వారం వరకు అడవుల్లో జన సంచారాన్ని అటవీ శాఖ నిలుపుదల చేసింది. గిరిజనులు కూడా ఈ సమయాల్లో చిన్నతరహా అటవీ ఉత్పత్తుల కోసం అడవుల్లో తిరగకుండా చర్యలు చేపడుతున్నారు.

మూడు నెలలు అడవిలోకి అనుమతి లేదు

నల్లమలలో పులుల సమాగ సమయాల్లో వాటికి ఏకాంతం కల్పించడం ద్వారా పులుల సంఖ్య గణనీయంగా పెరిగేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు నల్లమల పరిధిలోని ఎకో – టూరిజం రిసార్ట్‌లను, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మూడు నెలల పాటు నిలిపి వేశాం. ఇందుకు అందరూ సహకరించాలి.

– దొరస్వామి, ఎఫ్ఆర్ఓ, నాగలూటి

స్కిల్ టెస్ట్ ప్రారంభం

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పోస్టుల భర్తీకి శుక్రవారం పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో స్కిల్ టెస్ట్‌ను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ప్రారంభించారు. జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రిన్సిపాల్ పోస్టులకు టెస్ట్ నిర్వహించారు. మధ్యాహ్నం సీఆర్‌టీ హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించిన టెస్ట్ జరిపారు. హిందీలో ఒకరు మినహా అందరూ హాజరయ్యారు. డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలికల స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, నంద్యాల జిల్లా నుంచి డోన్ డిప్యూటీ డీఈఓ మహమ్మద్ బేగ్ పాల్గొన్నారు.

నేడు 13 సబ్జెక్టులకు..

శనివారం 13 సబ్జెక్టులకు సంబంధించి స్కిల్ టెస్ట్ జరగనుంది. సీఆర్‌టీ పోస్టులలో గణితం, బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, ఉర్దూ, పీఈటీ, పీజీటీ విభాగంలో సివిక్స్, కామర్స్, సీఎస్ఈ, ఎకనామిక్స్, జీఎఫ్‌సీ, రిటైల్ మేనేజ్‌మెంట్, పీఎస్‌టీ, ఎఅండ్‌టీ సబ్జెక్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నారు.

రూ. 100 కోట్లతో 'వికాస్' పనులు

- సెర్ప్ సీఈఓ ఇంతియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి జన వికాస్ కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈఓ, మైనార్టీ వెల్ఫేర్ శాఖ సెక్రటరీ ఎండీ ఇంతియాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మైనార్టీ సంక్షేమ పథకాల అమలు, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కలసి శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 వరకు పీఎం జన వికాస్ ప్రోగ్రామ్ కింద అనేక ప్రాజెక్టులు మంజూరయ్యాయని, అందులో హాస్టళ్లు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు, ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు, ఐటీఐ, ఉర్దూ డిగ్రీ కాలేజీలు, సద్భావన మండపాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయన్నారు. భూములు లేక ఇందులో కొన్ని ప్రాజెక్టులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ఆదోనిలో ఐటీఐ కాలేజీ కూడా మంజూరైందని, అనువైన స్థలాన్ని కేటాయించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ప్రధానమంత్రి జన వికాస్‌ప్రోగ్రామ్ కింద మంజూరైన కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని, అవసరమైన భూములు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మస్తాన్‌వలీ, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా పర్వీన్ పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధుల మెరుగుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని టీటీడీసీలో రెండు జిల్లాలకు చెందిన డీఆర్డీఏ, ఐకేపీ కార్యక్రమాలపై అధికారులు, ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎం, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ జిల్లా పరిశ్రమల కేంద్రం, హార్టికల్చర్ శాఖలకు చెందిన అధికారుల సమన్వయంతో ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని మహిళల జీవనోపాధుల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆదోని ప్రాంత అభివృద్ధిలో భాగంగా ఫిష్ ఆంధ్ర యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. పీఎంఈజీపీ కింద డైరీ యూనిట్లు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెజిటబుల్ డ్రయ్యర్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీఆర్డీఏ పీడీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 4వేల యూనిట్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారని, ఇప్పటి వరకు 2వేల మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో సెర్ప్, స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ నంచారయ్య, ఎస్ఆర్ఎల్ఎం డీజీఎం కేశవకుమార్, డీఆర్డీఏ ఏపీడీ శ్రీధర్ రావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కే సీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమలనగర్ కాలనీకి చెందిన బోయ నరసింహులు(42) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న బోయ నరసింహులకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె మహాదేవి గురువారం పాపకు జన్మనిచ్చింది. దీంతో నరసింహులు సంతోషంగా ఉంటూ అందరికీ చాక్లెట్‌లు పంచి పెట్టారు. రాత్రి అంతా మద్యం సేవించి ఇంటికెళ్లిపోయాడు. కుమార్తె కాన్పు కావడంతో నరసింహులు భార్య లక్ష్మి ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉండిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నరసింహులు ఉరి వేసుకున్నట్లు ఆదోని త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

కస్తూర్బా కళాశాలలో నిర్మలకు సీటు

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన విద్యార్థిని నిర్మలకు ఆస్పరి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల కళాశాలలో సీటు కేటాయించినట్లు ఎంపీడీఓ గీతావాణి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని నిర్మలను అభినందించారు. విద్యార్థిని నిర్మల 2021-22లో పదితరగతి పాసై 537 మార్కులు సాధించిందన్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో పై చదువులకు వెళ్లలేక సతమతమవుతుండడంతో అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు విద్యార్థినికి ఆస్పరిలోని కస్తూర్బా బాలికల కళాశాలలో బైపీసీ సీటు కేటాయించినట్లు చెప్పారు. దీంతో ఆ విద్యార్థిని ఎంపీడీఓకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివరాములు పాల్గొన్నారు.

వైద్యం.. పెరిగిన నమ్మకం

- కర్నూలు పెద్దాసుపత్రిలో 'సూపర్' సేవలు
- అందుబాటులో అత్యాధునిక వైద్యం
- హైదరాబాద్‌కు దీటుగా కర్నూలులో చికిత్సలు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



పోయే ప్రాణాన్ని నిలిపే శక్తి వైద్యుల సొంతం. అలాంటి వైద్యులకు కర్నూలు నిలయంగా మారింది. ఒకప్పుడు పెద్ద ఆపరేషన్ల కోసం బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేవారు. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల వాసులకు కర్నూలు పెద్ద దిక్కయింది. సీమ ముఖద్వారంలో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుతున్నాయి. అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. ఈ నెల ఒకటో తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 26 అర్బన్‌హెల్త్ సెంటర్లు, ఒక బోధనాసుపత్రి ఉన్నాయి. ప్రస్తుత వైద్య విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులు నియమించింది. వీరితో పాటు సీహెచ్‌సీల్లో గైనకాలజిస్టు, పీడియాట్రిస్ట్, అనెస్తెటిస్టులు ఉంటారు. ఒక ఏరియా ఆసుపత్రుల్లో ఎంబీబీఎస్ వైద్యులతో పాటు స్పెషలిస్టు వైద్యులూ చికిత్స చేస్తారు. 2019 తర్వాత ఇతర సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లోనూ పీజీ సీట్లు మంజూరయ్యాయి. మొత్తం 8 విభాగాల్లో 13 సీట్లు మంజూరు కావడంతో వైద్యవర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అలాగే స్పెషాలిటీ కోర్సుల్లోని పీజీ సీట్లు 2019కి ముందు కేవలం 138 మాత్రమే ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అదనంగా మరో 26 సీట్లు పెరిగి మొత్తం పీజీ సీట్ల సంఖ్య 164కు చేరింది. అలాగే గతంలో 300 వరకు మాత్రమే స్టాఫ్‌నర్సులు ఉండేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య 800లకు పెరిగింది. దీనివల్ల రోగుల పట్ల నర్సింగ్ కేర్ మరింత పెరిగింది. కొత్తగా నియమకాలు, వైద్యులకు పదోన్నతులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం

కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 126 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిగింది. ఇందుకోసం సీనియర్ వైద్యుల సేవలను గుర్తించి వారికి పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు అప్పటి వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా దశాబ్దానికి పైగా పనిచేస్తున్న వారిని అసోసియేట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్‌గా పనిచేస్తున్న వారిని ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. అదనంగా నాలుగు ప్రొఫెసర్, 22 అసోసియేట్, 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేశారు. వైద్యులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించారు. ఎన్నడూ లేనంతగా పెద్ద ఎత్తున వైద్యుల పరస్పర బదిలీలు జరిగాయి. దీంతో కోరుకున్న ప్రాంతానికి చాలా మంది వైద్యులు బదిలీపై తిరిగి వచ్చారు. ఫలితంగా జిల్లాల విభజనకు ముందు ఎంతగా ఓపీ, ఐపీ ఉండిందో ఇప్పటికీ రోగుల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు.

ప్రైవేటులోనూ తగ్గని సేవలు

ఒకప్పుడు గుండె ఆపరేషన్లు అంటే హైదరాబాద్‌కు తరలివెళ్లేవారు. కానీ ప్రస్తుతం రాష్ట్రం నలుమూలల నుంచి కూడా కర్నూలుకే వస్తున్నారు. పాతికేళ్ల క్రితం కర్నూలులో ఒకటో, రెండో పేరెన్నికగన్న ప్రైవేటు ఆసుపత్రులుండేవి. ఇప్పుడు స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ఆసుపత్రుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు ఒక్కరు కూడా లేని పరిస్థితి నుంచి ప్రస్తుతం ప్రతి సూపర్‌స్పెషాలిటీ విభాగంలో 20 మందికి పైగా వైద్యులు ఉన్న పరిస్థితి ఉంది.

కిడ్నీమార్పిడి మరిచిపోలేనిది



ఒకప్పుడు కిడ్నీ మార్పిడి చేయించుకోవాలంటే మహానగరాలకు వెళ్లాల్సి వచ్చేది. అలాంటిది 2019 ఆగష్టు 19న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే ఓర్వకల్లుకు చెందిన రామాంజనేయులు అనే యువకునికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించాం. దీంతో పాటు పీజీ సీట్ల కోసం అహర్నిశలు శ్రమించాం. ఎంపీతో కలిసి ఢిల్లీ వెళ్లి ఎన్ఎంసీ సభ్యులను కలిసి ఒప్పించాం. ఆసుపత్రిలో ఈఎస్‌డబ్ల్యుఎల్‌పై చేసిన కేసుల గురించి దుబాయ్‌లో జరిగిన పేపర్‌ప్రెజెంటేషన్ మరిచిపోలేనిది. – డాక్టర్ సీతారామయ్య, యురాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

గర్భవతుల ప్రాణాలు కాపాడాం



ప్రాణాపాయ స్థితిలో వచ్చిన గర్భవతులకు ప్రాణాలు పోసే విధంగా పెద్దాసుపత్రిలో చేసిన ఆపరేషన్లు నిత్యం జరుగుతూ ఉంటాయి. ఇటీవల ప్లెసెంటా పర్‌క్రీటా శస్త్రచికిత్సలు చాలా చేశాం. ఇందులో గర్భసంచి గోడలోకి ప్లెసెంటా(మాయ) చొచ్చుకుపోతుంటాయి. ఇలాంటి వారికి ఒకవైపు సిజేరియన్ చేస్తూనే మరోవైపు రక్తస్రావం గాకుండా గర్భసంచి తొలగించాలి. అనంతరం ఐసీయులో ఉంచి ప్రాణాలు కాపాడిన కేసులు ఎన్నో. కొంత మందికి గర్భం గర్భసంచిలో గాకుండా ట్యూబ్‌లో ఏర్పడి 12 వారాల తర్వాత ట్యూబ్ పగిలిపోతుంది. ఇలాంటి వారికి అత్యవసరంగా ట్యూబ్ కట్ చేసి ఆపరేషన్ చేసి గర్భం తొలగించాల్సి వస్తుంది. – డాక్టర్ ఎస్. వెంకటరమణ, గైనకాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

ఆధునిక పద్ధతిలో ఎముకలు అతికించాం



ఇటీవల ఆళ్లగడ్డకు సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకునికి రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అతని మక్కి, తొడ ఎముక విరగడంతో పాటు చిద్రమై కొద్దిపాటి ఎముక నాశనం అయ్యింది. నాలుగు రోజుల తర్వాత అతన్ని కుటుంబసభ్యులు మా వద్దకు తీసుకొచ్చారు. వెంటనే అతనికి అవసరమైన శస్త్రచికిత్సలు చేశాం. బెంగళూరులోని బోన్ బ్యాంక్ నుంచి బోన్ అల్లోగ్రాఫ్ తీసుకొచ్చి బోన్ డిఫెక్ట్‌ను భర్తీ చేశాము. దీని వల్ల అతను త్వరగా కోలుకున్నాడు. ఈ కేసును నా జీవితంలో మరువలేనిది.
–డాక్టర్ ఎం. గణేష్‌కుమార్ రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు, కర్నూలు

కొనసాగిన సచివాలయ ఉద్యోగుల బదిలీలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన ఉద్యోగుల బదిలీలను శుక్రవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో గ్రేడ్-5, 6 పంచాయతీ కార్యదర్శులకు ఇంటర్ డిస్ట్రిక్ట్, అదర్ బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీలకు 21 మంది, గ్రేడ్-5 కేటగిరీలో 65, గ్రేడ్ -6 కేటగిరిలో 99 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఎస్ఈ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలను నిర్వహించారు. పీఆర్ ఎస్ఈ కె.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జరిగిన కౌన్సెలింగ్‌కు ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీలకు 11 మంది, అదర్స్ 80 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈలు చౌడేశ్వరరావు, గంగాధర్, నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మిదేవి ఆధ్వర్యంలో 83 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీగా ఉన్న ప్రాంతాలకు బదిలీ చేశారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఈఓ, డీపీఓ

అట్రాసిటీ కేసుల్లో దోషులకు శిక్షపడాలి

- ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- పునరావాసం, పరిహారాలను వేగవంతంగా చెల్లించేందుకు జేసీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేసి అట్రాసిటీ కేసుల్లో దోషులకు శిక్షపడేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లో భాగంగా పునరావాసం, పరిహారాలకుసంబంధించి వేగవంతం చేసేందుకు జేసీ అధ్యక్షతన కమిటీని వేయనున్నట్లు చెప్పారు. ఇందులో సభ్యులుగా డీఆర్వో, డీఎస్పీ ఉంటారన్నారు. నెలకొకసారి ఈ కమిటీ సమావేశమై తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. చట్టం అమలులో కమిటీ సభ్యులు, పోలీసులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. రానున్న డీవీఎంసీ సమావేశాలను మరింత సమర్థవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ డే రోజును కేటాయించి నిర్వహిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

- కమిటీ సభ్యులు శాంతకుమార్ మాట్లాడుతూ.. దేవనకొండ, పత్తికొండ, మండలాల్లో ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రతిపాదనలు వచ్చాయని, అందుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలన్నారు. కమిటీ సభ్యులు సాయిప్రదీప్, చిటికెల శామ్యూల్, రాజు, ఊట్ల రమేష్‌బాబు మాట్లాడుతూ..కర్నూలు ఎస్సీ బాలికల వసతి గృహాల్లో ఉండి కేవీఆర్ కళాశాలలో చదువుతున్న వారి కోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని, కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలని కోరారు. ఎస్సీ కాలనీల్లో కాకుండా గ్రామం మధ్యలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని జరపాలని కోరారు. ఉలిందకొండ, కొల్లంపల్లి తండాల్లో ఇటుక పరిశ్రమల పొగ పొలాల మీదకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రొహిబిషన్ ఆఫ్ మాన్యువల్ స్కావెంజింగ్ యాక్ట్ సమావేశంలో కమిటీ సభ్యులు బాబుజీ మాట్లాడుతూ..విద్య, ఉపాధి రంగాల్లో సఫాయి కర్మచారుల కుటుంబాలు చాలా వెనుకబడి ఉన్నాయని, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబు, డీవీఎంసీ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళతో వల వేయించి.. భర్తను హత్య చేయించి!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని దారుణం
- హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- ప్రియుడితో కలిసి హత్యకు పాల్పడిన భార్య
- ఏడుగురు నిందితుల అరెస్ట్

నందికొట్కూరు: హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన వెంకటన్న (42)ను సొంత భార్యనే పొట్టన పెట్టుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలసి హత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన రాము అలియాస్ వెంకటన్నకు భార్య శ్యామల, కొడుకు శరత్‌చంద్ర(9) ఉన్నారు. భార్య ఇంటివద్ద చీరల వ్యాపారం చేస్తుండగా.. వెంకటన్న మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 19న వెంకటన్న హత్యకు గురయ్యాడు. కాగా భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా భార్యనే నిందితురాలని తేలింది. బేతంచెర్లకు చెందిన కుమారస్వామితో శ్యామలకు వివాహేతర సంబంధం ఉంది. భార్య ప్రవర్తనపై అనుమానం రావడంతో వెంకటన్న వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో భర్తను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు కుమారస్వామి, అతని స్నేహితులు ఐదుగురితో కలిసి శ్యామల హత్యకు కుట్ర పన్నింది. ఈ మేరకు బేతంచెర్లకు చెందిన దేవమణి అనే మహిళను రంగంలోకి దింపారు. ఆమె ఫోన్‌లో వెంకటన్నను పరిచయం చేసుకుని వల పన్నింది. ఈనెల 19న ఫోన్ చేసి జూపాడుబంగ్లా మండలంలోని భాస్కరాపురం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ గట్టు వద్దకు రావాలని చెప్పడంతో వెంకటన్న బైక్‌పై వెళ్లాడు. కాగా అప్పటికే అక్కడ మాటు వేసిన కుమారస్వామి, అతని స్నేహితులు నలుగురితో కలిసి వెంకటన్న గొంతుకు బైక్ తీగ బిగించి చంపేశారు. ఆ తర్వాత ముఖం గుర్తు పట్టకుండా రాళ్లతో మోదారు. కాగా పోలీసులు శ్యామల ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆ మేరకు కేసు దర్యాప్తు చేపట్టి ఛేదించినట్లు సీఐ తెలిపారు. హత్యకు పాల్పడిన శ్యామల, ఆమె ప్రియుడు కుమారస్వామి, అతని స్నేహితులు శ్రీనివాసులు, లక్ష్మన్న, హుసేన్ నాయుడు, రంగనాయకులు, దేవమణిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

నీటి వసతి ఉంటేనే పత్తి సాగు చేయాలి

- ఎర్ర నేలల్లో ఈ నెల 15 వరకు విత్తనం వేసుకోవచ్చు
- నల్ల రేగడి నేలల్లో ఆగస్టు మధ్య వరకు విత్తు కోవచ్చు
- కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి(ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సాగు చేసే పంటల్లో పత్తి ప్రధానమైనది. గత ఏడాది 2.65 లక్షల హెక్టార్లలో సాగైంది. ఈ ఏడాది 2.50 లక్షల హెకార్లలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జిల్లాలో అక్కడక్కడ వర్షాలు పడుతుండటంతో రైతులు పత్తి విత్తనం వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సాలురెడ్డి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- పత్తిని ఎర్ర నేలల్లో ఈ నెల 15 వరకు, నల్లరేగడి నేలల్లో జూలై నుంచి ఆగస్టు మధ్య వరకు విత్తుకోవచ్చు. బీటి పత్తి సంకర రకాల్లో ఎకరాకు 750 గ్రాముల నుంచి కిలో వరకు విత్తనాన్ని విత్తుకోవచ్చు.
- కాయతొలిచే పురుగుల్లో బీటి నిరోధక శక్తిని పెంచుకోకుండా ఉండాలంటే రైతులు బీటీ పత్తి వేసిన పొలం చుట్టు సాధారణ పత్తి(నాన్‌బీటీ)ని లేదంటే కంది పంటలను తప్పని సరిగా వేసుకోవాలి.
- నీటి వసతి లేనపుడు పత్తి పంటను తేలికపాటి ఎర్ర నేలల్లో సాగు చేయరాదు.
- పత్తిని ఒకే పంటగా కాకుండా పెసర లేదా మినుము + పత్తి 2:1 లేదా కంది+ పత్తి 6:1 లేదా 8:1 నిష్పత్తిలో విత్తుకోవాలి.
- పత్తి విత్తనం మీద పీచును తొలగించడానికి కిలో విత్తనానికి 80-100 మిలీ సల్ఫూరిక్ ఆమ్లంతో 2-3 నిముషాలు శుద్ధి చేయాలి. తరువాత 2-3 సార్లు నీటితో బాగ కడిగి ఆమ్లాన్ని తొలగించాలి. తప్పనిసరిగా సున్నపు నీటితో కడిగి తటస్థీకరించాలి.
- కలుపు నివారణకు విత్తిన వెంటనే పెండిమిథాలిన్ అనే కలుపు మందును ఎకరానికి 1 లీటరు, పత్తి విత్తిన 20-25 రోజులకు క్విజలాపాప్‌ఎథైల్ 400 మిలీ+ పైరితాయోబ్యాక్ సోడియం 200 మిలీ పిచికారీ చేయాలి. పత్తి తొలిదశలో పవర్ వీడర్స్‌తో గాని లేదా మినీ ట్రాక్టరుతో గాని అంతరకృషి చేయాలి.
- పత్తిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును వేయవలసి ఉంటుంది. అమెకరిన్ రకాలకు ఎకరాకు 36 కిలోల నత్రజని, 18కిలోల భాస్వరం, 18కిలోల పొటాష్, అలాగే హైబ్రిడ్ పత్తిలో ఎకరాకు 48 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వాడుకోవాలి. బిటీ హైబ్రిడ్స్‌కు 25 శాతం అధికంగా నత్రజని ఎరువులను మూడు సమ భాగాలుగా విభజించి పత్తి విత్తిన 30, 60, 90 రోజుల్లో వేయవలసి ఉంటుంది.

* మనం మాట్లాడుకోవాల్సిందే!

ఆధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంది'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

• • •

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

• • •

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టెస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్


సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటెలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

" నా నెక్ట్స్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క, ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్ షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.

